క్లుప్తంగా

జీసీసీ గోడౌన్ ఇన్‌చార్జిగా రత్నం నియామకం

కొయ్యూరు: మండల కేంద్రంలోని జీసీసీ గోడౌన్ ఇన్‌చార్జిగా జుర్ర రత్నంను నియమించారు. ఆమె చింతపల్లి జీసీసీలో పనిచేస్తున్నారు. ఆమెకు ఇటీవల పదోన్నతి రావడంతో గోడౌన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు ఇక్కడి గౌడౌన్ ఇన్‌చార్జిగా పనిచేసిన ధర్మరాజును కాకరపాడు పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ఈ–పంట నమోదు చేసుకోవాలి

కొయ్యూరు: రైతులు తమ పంటల సాగుపై ఈ–పంట నమోదు చేయించుకోవాలని ఏవో ప్రియాంక బుధవారం తెలిపారు.వాణిజ్య లేదా ఆహార పంటలు వేసుకున్నా సంబంధిత ఆర్‌ఎస్‌కెలలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ–పంటలో వివరాలు నమోదు చేసుకోని వారికి ప్రభుత్వ సాయం వంటిది వర్తించిందన్నారు. ఇందుకోసం ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆత్మీయ సన్మానం



సీఐ వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యూరు: కొయ్యూరు సీఐగా పనిచేసిన వెంకటరమణ పాడేరు సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న సీఐ వెంకటరమణ జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐ వెంకటరమణ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఎస్‌ఐ పనిచేశానన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు, నాయకుడు ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్మూర్తి తదితరులు సీఐను సన్మానించారు. కొయ్యూరు, మంప ఎస్‌ఐలు కిషోర్ వర్మ, శంకర్‌రావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు



రైతులకు సూచనలిస్తున్న ఏవో గిరిబాబు

గూడెంకొత్తవీధి: రైతులు ఆధునిక పద్ధతిలో సేంద్రియ సాగు చేస్తే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి గిరిబాబు సూచించారు. మండంలోని రింతాడ రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వరి సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. అనంతరం రైతు సదస్సును నిర్వహించారు. సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ సోమేష్ కుమార్, లక్ష్మణరావు, శరభన్నదొర పాల్గొన్నారు.


భక్తుల వితరణ



భక్తులు అందజేసిన టేబుళ్లు, కుర్చీలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరానికి డైనింగ్ టేబుళ్ల ఏర్పాటు కు భక్తులు వాడ్రేవు సుందరరావు. సీతామహాలక్ష్మి దంపతులు రూ.20,000 నగదు, ముప్పన మోహన్‌కుమార్ సావిత్ర దంపతులు రూ.3, 000, చాగంటి రవిప్రసాద్, సీతాదేవి దంపతులు రూ. 3,000 అందజేశారు. ఆయా సొమ్ముతో బుధవారం కొనుగోలు చేసిన టేబుళ్లు, కుర్చీలను మందిరంలోని భోజనశాలలో ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం భారీ అన్నసమారాధన చేయనున్నట్టు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల అన్నదాన సుఖీభవ పథకం ద్వారా కొంతమందికే సొమ్ము జమ అయిందన్నారు. అటవీశాఖ అభ్యంతరాలతో పలు గ్రామాలకు రోడ్ల అభివృద్ధి జరగలేదన్నారు.సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశానికి మండలంలోని పలు ప్రాంతాల నుంచి డ్వాక్రా మహిళలను ప్రైవేట్ వాహనాల్లో సమావేశానికి తరలించారు. పెద్దిరాజు, తాతారావు. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు?



ఊట గెడ్డ నీటిని సేకరిస్తున్న ఉరుములు గ్రామస్తులు



వల్లిపనసలో బురద నీటిలో నుంచి ఊట నీటిని సేకరిస్తున్న ఆదివాసీలు

- గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- ఊటగెడ్డలే శరణ్యం
- కలుపిత నీటితో అవస్థలు
- ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు



ఉరుములు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

అరకులోయటౌన్: గిరిగ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. తాగునీటి సౌకర్యాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీటి ఏర్పాటుకు సౌకర్యాలు లేని చోట్ల తాగునీరందిస్తామని హడావుడి పనులు చేపట్టి అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో ఆదివాసీలు సతమతమవుతున్నారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక కాలం గడుపుతున్నారు. తాగునీటి సౌకర్యాలు లేక ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. ఎండైనా, వానైనా గెడ్డలే వారికి దిక్కుగా మారాయి. గ్రామాలకు సుదూరంలో ఉన్న ఊటగెడ్డలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ఆదివాసీలు దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- మండలంలోని మారుమూల ఇరగాయి పంచాయతీ పరిధిలోని ఉరుములు, వల్లీ పనస, బలియగుడ, దోనిగుమ్మి, జర్మనిగుడ పైవీధి, బొర్రా కొండ గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది.
- ఉరుములు గ్రామంలో 62 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి తాగునీటి సౌకర్యం లేక ఊట గెడ్డలను ఆశ్రయిస్తున్నారు. తాగునీటి సమస్య గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జల్‌జీవన్ మిషన్ నిధులతో బోర్ వెల్ తవ్వకుండానే నీటి ట్యాంక్ నిర్మించి, పైపులైన్ వేసి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. బోర్ వెల్ వేయకపోవడంతో ట్యాంక్, ట్యాప్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయని, ఇప్పటికైనా బోర్ వేసి నీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- వల్లీపనస గ్రామంలో 41 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో బోర్ వెల్ వేసి వదిలేశారు. ట్యాంక్, పైపు లైన్ వేయలేదు. గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఊటగెట్ట నీటిని వినియోగిస్తున్నారు.
- ఇరగాయి పంచాయతీ బలియగుడ, దోనిగుమ్మి, జర్మనిగుడ పైవీధి, బొర్రా కొండ గ్రామస్తులు తీవ్ర తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. ఎటువంటి తాగునీటి సౌకర్యాలు లేక ఊటగెడ్డ నీటిని సేకరించి, వాటిని వినియోగించి అనారోగ్య సమస్యలతో సతమతమవున్నారు. ఇప్పటికైన ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో తాగునీటి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



ఉరుములు గ్రామంలో నిరుపయోగంగా కుళాయి

అధికారులు స్పందించాలి



గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుమార్లు అధికారులకు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో గెడ్డనీరు, ఊట నీటిని సేకరించి వినియోగిస్తున్నాం. కలుషిత నీటిని సేవించి రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– పోయాదేవి, ఉరుములు గ్రామం

ప్రజాధనం వృథా



ఉరుములు గ్రామంలో జేజేఎం నిధులతో ట్యాంక్, కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. బోర్ వేయడం మరిచారు. వల్లీపనసలో బోర్ వేశారు. ట్యాంక్, పైపు లైన్ వేయకుండా విడిచిపెట్టారు. దీంతో గిరిజనులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. ఇలా అర్ధంతరంగా పనులు చేసి విడిచి పెట్టడంతో ప్రజాధనం వృథా అవుతోంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– మాదల బుటికి, సర్పంచ్, ఇరగాయి పంచాయతీ, అరకులోయ మండలం

ఎంఈవో–2గా గెన్ను బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు జాయినింగ్ ఆర్డర్‌ను అందజేస్తున్న ఎంఈవో–2 గెన్ను

డుంబ్రిగుడ: డుంబ్రిగుడు ఎంఈవో– 2 గా జి.గెన్ను బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఎంఈవో–2 గెన్ను మాట్లాడుతూ మండలంలోని విద్యాభివృద్ధికి తోడ్పాడతానన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో–1 శెట్టి సుందర్‌రావును కలిశారు. పీఆర్‌టీయు జిల్లా కార్యదర్శి శెట్టి అప్పలరాజు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, శెట్టి రాజు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన



తోకరాయి గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు, అధికారులు

సీలేరు: మండలంలో చట్రాపల్లి, తోకరాయి గ్రామాల గిరిజనులకు పక్కాగృహాల నిర్మాణానికి తహసీల్దార్ అన్నాజీరావు బుధవారం స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో గృహాల నిర్మాణానికి సంబంధించి స్థలాల పరిశీలనకు ఆయన పర్యటించారు. తోకరాయి, చట్రాపల్లి. గ్రామాల్లో రెండు చోట్ల స్థలాలను పరిశీలించారు. గతేడాది సెప్టెంబర్ మండలంలో భారీ విపత్తు వల్ల కొండరాళ్లతో పాటు వరదనీరు గ్రామాల్లోకి వచ్చి ఇళ్లను ముంచెత్తాయి. ఆయా గ్రామాల్లో బాధితులకు పునరావాసం కల్పిస్తామని, గృహాలు నిర్మించి అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. చట్రాపల్లిలో–37, తోకరాయిలో–62 బాధితులున్నట్టు గుర్తించారు. ఈ మేరకు తహసీల్దార్ అన్నాజీరావు. హౌసింగ్ ఏఈ సూర్య, ఇరిగేషన్ ఏఈ నాగమణి కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అనంతరం జెన్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీ జెన్ కో విద్యుత్ కాంప్లెక్స్‌లో సీలేరు పార్వతీనగర్ వద్ద జెన్ కో నూతనంగా నిర్మించనున్న పంపుడ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలను జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డితో, తహసీల్దార్ సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వ్యాపార, ఆర్థికాభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కాంధ్ర వన్–ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రిన్యూర్‌పై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నారు. సమాజంలో సృజనాత్మకత ఆవిష్కరణ, వ్యాపార స్ఫూర్తిని పెంపొందించుకోవాలని కోరారు. వ్యాపార, ఆర్థికాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ప్రతీ ఆలోచనలోనూ, ప్రతీ వ్యాపారంలోనూ నైతిక విలువలు, నిజాయితీ బాధ్యతను పాటించడానికి అంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం .అనిత కుమారి, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, లచ్చన్న, రాజు, కామేశ్వరరావు, సునీల్, సోంబాబు, సురేష్, భవానీ, అంబిక, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందజేయాలి



వరదలకు నీటిపాలైన వరి పంటను పరిశీలిస్తున్న సర్పంచ్ సున్నం అభిరామ్

కూనవరం: వరదలో ముంపునకు గురైన పంట పొలాలను సర్వే చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు చినార్కూరు పంచాయతీలో నీటమునిగిన వరిచేలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పంట నష్టం సర్వే నిర్వహించి, పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. గత 15 రోజుల నుంచి వరదలు మండలాన్ని చుట్టు ముట్టాయని ఇంతవరకు వరద బియ్యం ఇవ్వలేదని ఆరోపించారు. వర్షాలు, వరదల మూలంగా పనులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరారు. రైతులు పొడియం బజారు, మోసం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం మోసం



సొలభం గ్రామంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ హనుమంతరావు, నాయకులు

జి.మాడుగుల: ఎన్నికల్లో బూటకపు హామీలను గుప్పించి,ప్ర జలను మోసగించి కూటమి నాయకులు అధికారంలోని వచ్చారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మాని మత్స్యకొండంనాయుడు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలో సొలభం, గడుతూరు పంచాయతీల్లో పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ హనుమంతరావు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని, గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. మెరుగైన పాలన అందిస్తానని ప్రగల్భాలు చేసిన చంద్రబాబు నేడు వలంటీర్ వ్యవస్థను నిలిపివేసి, సంక్షేమ పథకాలు రద్దు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని నేటి వరకు అమలుచేయలేదన్నారు. గిరిజన ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, దివ్యాంగుల పెన్షన్లు రద్దుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా ప్రక్రియను రద్దు చేసి ప్రజలను మరింత ఇబ్బందులకు సమస్యలకు గురి చేశారని వారు ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చేసిన ప్రకటనలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను చంద్రబాబు విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పండన్న, నాయకులు, గ్రామస్తులు తదితరలు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : పట్టణంలోని లోచలిపుట్టులో ఏర్పాటు చేసిన భారీ గణనాథునికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ప్రారభించి భక్తులకు ప్రసాదాలను వడ్డించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నాయకులు బాబూరావు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులోని పలుచోట్ల బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కమిటీ సభ్యులు నాగరాజు, శ్రీను, యాసీన్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సీలేరులోని అన్నసమారాధనలో భక్తులు



ఎటపాకలో వినాయకుడిని దర్శించుకున్న సీఐ, ఎస్‌ఐ

ఎటపాక: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో యంగ్ స్టార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం సీఐ కన్నపరాజు, ఎస్సై అప్పలరాజు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరుపుకోవాలని సూచించారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



మట్టుజోరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, ఎంపీడీవో రమాదేవి



సంకాడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, నేతలు



గెమ్మెలిలో విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండబాబు

జి.మాడుగుల: గెమ్మెలి సచివాలయంలో రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ సీదరి కొండబాబు తదితరులు బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు రాజ్‌మా పంటపై దృష్టి సారించాలన్నారు. ఎంపీఈవో శివ, మహిళా పోలీస్ రత్నకుమారి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మట్టుజోరులో ఏవో కె.సుధాకర్ ఆధ్వర్యంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో రమాదేవి తదితరులు రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ రాజ్‌మా సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడ సచివాలయంలో బుధవారం రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచ్ దేశగిరి నాగులమ్మ, మామిడి నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ గంతన్న దొర, పీసా కమిటీ కార్యదర్శి బాబురావు, సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వేడుకలో స్థానికుల సందడి

రాజవొమ్మంగి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. పిల్లలు, పెద్దలు డ్యాన్సులతో సందడి చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపారాధన చేస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ప్రత్యేక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 300 దీపాలతో దీపారాధ చేపట్టారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏపీఎం దేవమంగలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత కుంకుమ పూజను నిర్వహించి, అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి, భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు.

ఆదికర్మయోగి అభియాన్‌తో గ్రామాల అభివృద్ధి

గంగవరం: ఆదికర్మ యోగి అభియాన్ పథకంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఉపాధి హామీ ఏపీవో ప్రకాశ్ అన్నారు. లక్కొండ పంచాయతీ సర్పంచ్ ఒండోపు ప్రతాప్‌రెడ్డితో కలిసి గొరగొమ్మి గ్రామంలో ఆయన బుధవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు ఒండోపు శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి కోసూరి రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

అడ్డతీగల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ (కాకినాడ) ఆధ్వర్యంలో సీపీఆర్ (కాంప్రెషన్ ఓన్లీ లైఫ్ సపోర్ట్)పై ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండె పనితీరును సరిదిద్దే సీపీఆర్‌పై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కళ్యాణ చక్రవర్తి చెప్పారు. ప్రాణ రక్షణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీపీఆర్ ప్రక్రియపై 275 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, అనంతరం వారికి ధ్రువపత్రాలను అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, కిరణ్, వరప్రసాద్, బాబీ, సీపీఆర్ ప్రోగ్రామ్ నిర్వాహకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ ఉద్యోగికి నివాళి



గోవిందరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జీసీసీ డీఎం వెంకటేష్ తదితరులు

చింతపల్లి: చింతపల్లి జీసీసీలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సంపరి గోవిందరావుకు జీసీసీ చింతపల్లి డివిజన్ మేనేజర్ బుక్కా వెంకటేష్ నివాళులర్పించారు. ప్రస్తుతం గోవింద్ కొయ్యూరు మండలం కాకరపాడు జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గోవింద్ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. జీసీసీ మేనేజర్లు విజయకుమార్, మల్లేశ్వరరావు, బంక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, గ్యాస్ గొడౌన్ సూపరింటిండెంట్ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ ఉద్యోగి మృతికి సంతాపం

కొయ్యూరు: మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కాకరపాడు పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సంపరి గోవిందరావు(55) బుధవారం ఆయన స్వగృహంలో చింతపల్లిలో మృతి చెందారు. గోవిందరారవు మృతికి బీఎం విజయ్‌కుమార్, సిబ్బంది సంతాపం తెలిపారు.



గోవిందరావు (ఫైల్)

రహదారుల నిర్మాణంలో కొరవడిన నాణ్యత



కోతకు గురైన పెద్దపాడు తారురోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ పెద్దపాడు నుంచి చాపరాయి వరకు దెబ్బతిన్న రహదారిని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్, నాయకులు, గ్రామస్తులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మించినా మూన్నాళ్లకే పెచ్చులూడి గోతులమయంగా మారిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 7న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామంలో పర్యటించి, రహదారిని పరిశీలించి, నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. అయితే రోడ్డు నిర్మాణంపై కూటమి ప్రభుత్వం అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కొద్ది రోజులుకే కోతకు గురైందన్నారు. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని, గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతతో రహదారి పనులు చేయాలని కోరారు. మండల కార్యదర్శి రామునాయుడు, పోతంగి పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయదశమి తదితరులున్నారు.